# కావాలి - సానుభూతి . . .

'శేషయ్యా?'

'ప్రభూ!'

'నాకు సంభవించిన యీ ఘోర విపత్తుకు నువ్వు సానుభూతి చూపకుండా యెలా వుండగలుగుతున్నావోయ్?'

'ఘోర విపత్తా? ఏమిటి ప్రభూ? తమకే!'

'హా శేషయ్యా! మనకు సంభవించిన ఈఘోర విపత్తు చూసి ప్రధాన శేఖరుడవైన నువ్వు అణుమాత్రం చలించకుండా యెలా?–'

'ప్రభూ! మనకే సంభవించిందా? ఘోరవిపత్తే బాబోయ్!'

'ఏమీ ఎరగనివాడిలా మాట్లాడతావోయ్ శేషయ్యా!'

'ప్రభూ క్షమించాలి–నాకేమీ తెలీదు–'

'ఇది సంభవమా శేషయ్యా?'

'ఏది సంభవమాండి?'

'ఇదే ఈఘోర విపత్తే–నీకు తెలీదూ?'

'తెలీదండి- తెలీదు- లెంపలు వేసుకుంటున్నా'

'గ్రహచారం! నీబోటివాడు నాకు మంత్రిగా దాపరించడం–?'

'మాటలని ఏం ప్రయోజనమండి? రాణీసాహేబావారు బావున్నారా? ఆ విపత్తేమిటో ఆ వూసేమిటో చెప్పకండా వూరికే నిందిస్తే–?'

'ఎంత మొండి శేషయ్యవు!'

'బావుందండి వరస! మీ ధోరణేమీ నాకు తెలిసి చావటంలేదు-'

'మనకు సంభవించిన విపత్తు-ఘోర విపత్తు తెలీటంలేదూ?'

'ఇంతకీ ఏం జరిగిందేమండి? తెల్లారి లేచి గిల్లి కూసుకుంటే అంతా బాగానే వున్నాము. సంస్థానపు కోళ్ళన్నీ మామూలుగానే కూశాయి. సూర్యుడు యధావిధిగా ఉదయించాడు-'

'శేషయ్యా? ఇదా వేళాకోళాలకి సమయం?'

'ప్రభూ! మీ వరసేం బాగులేదు-సంగతి చెప్పకండా యిలా తలాయించడం-'

'ఎంత నంగనాచివి! పేపర్లో చూళ్ళేదూ?'

'ఏమిటండీ?'

'ఇంకా దాస్తావా ?-' 'నేను పేపరు మాస్తేకదండీ ?'

'అందుకే మొండి వెధవ్వాటాను-నీకోసం బోలెడు చందాలుపోసి ఎన్నో పేపర్లు తెప్పిస్తున్నా-ఎప్పటికైనా మన సంస్థానాన్ని కాస్త అభ్యుదయ మార్గాలలోకి మళ్లిస్తావేమోనని-'

'ఇదంతా వట్టి దండుగండీ-అసలు సంగతి తేల్చరూ-వీరుబాగున్నారు. నేను బాగున్నాను. రాణిగారు గులాబీ పువ్వులా ఛేచికూర్చుని మొఖం కడుక్కుంటున్నారు—ఇంకేమిటి మనకొచ్చిన బాధ ?'

'నీకు తెలీదు శేషయ్యా-ఈ బాధలు నీకు అర్థంకావు-'

'అవునండి- తెలీవు- తెలీవు- చెబితేగా తెలీడానికి ?'

'ఎంత నిష్ఠూర పెడుతున్నావు ?'

'నాకొద్దండి ఈ వెధవమంత్రిత్వం-కారణంలేకుండా పొద్దున్నే ఈ చీవాట్లు !'

'శేషయ్యా-జాలిలేదూ- నేను నిన్ను నా విచారాన్ని అర్థం చేసుకోమంటున్నా-'

'ప్రభూ ! మీకష్టం నాకష్టంకదూ ? వొద్దండి-కంట తడిపెట్టకండి-ఇదుగో తువాలు-ఎందుకండీ ఈదిగులూ, ఈ విచారమూనూ ?-'

'శేషయ్యా ! సర్వస్వం గంగలో కలిసిపోయింది-'

'హా ! మీరు ఏడుస్తూంటే నాకూ ఏడుపొస్తుంది - మానరూ ? నా నాయన! నా రాజా! నాయనగారు కాలంచేసి నప్పట్నుంచి పువ్వుల్లో పెట్టి సేవచేసి, కాపాడుతున్నా మిమ్మల్ని-మీకొచ్చిన కష్టం ?—'

'శేషయ్యా ! ఈ అవమానం నే భరించలేనోయ్ !'

'ప్రభూ ! దిగమింగండి !'

'శేషయ్యా ! ఇంక ప్రపంచం మొహం యెలా చూడగలనోయ్ !'

ప్రభూ ! మనకొచ్చిన ఘర్వాయేమీ లేదండి-అసలు సంగతి కాస్త నా చెవిని—'

'మన జహంగీరు—' 'ఏం జహంగీరు కేమండి ?'

'గిండీ పందేల్లో గవర్నరు కప్పును తన్నేసింది-'

'...............'